ప్రజాశక్తి

మంగళవారం 21 మే 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



సమావేశంలో మాట్లాడుతున్న సిపి రామకృష్ణ

స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ ప్రదేశాల వద్ద

నో ఫ్లయింగ్ జోన్

ప్రజాశక్తి - విజయవాడ, మైలవరం, వీరులపాడు, తిరువూరు : ఎన్‌టిఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ, విజయవాడ పార్లమెంట్, గన్నవరం అసెంబ్లీ నియోజక వర్గాలకు ఈనెల 13న చిన్న చిన్న ఘటనలు మినహా ప్రశాంతం ఎన్నికల నిర్వహించామని పోలీసు కమిషనర్ పిహెచ్‌డి.రామకృష్ణ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సుమారు 6000 మంది లా అండ్ ఆర్డర్, ఎఆర్, 10 ప్లటూన్ల ఎపిఎస్‌పి, 13 కంపెనీల పారామిలటరీ బలగాలతో, 1300 మంది ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వాలంటీర్లతో పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటు చేసి చిన్న చిన్న సంఘటనలు మినహా ఎక్కడా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం ఇవిఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ల ప్రాంతం నుండి రెండు కిలోమీటర్ల మేర రెడ్ జోన్ అమలు చేస్తున్నామని తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో గల జూపూడి గ్రామంలోని నిమ్రా, నోవా కళాశాలల్లో స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసిన నేపథ్యంలో అక్కడి నుండి రెండు కిలోమీటర్ల మేర రెడ్ జోన్ (నో ఫ్లయింగ్ జోన్)గా ప్రకటించినట్లు తెలిపారు. అందువల్ల సదరు ప్రాంతంలో డ్రోన్లుగనీ, బెలూన్లుగానీ ఎగరవేయడం నిషేధించినట్లు తెలిపారు. దీనిని అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు.

జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీలు

ఎన్నికలు పూర్తయి ఫలితాల కోసం వేచిచూస్తున్న నేపథ్యంలో హింసాత్మక సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా సోమవారం కార్లను, ద్విచక్ర వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చారా? మారణాయుధాలు ఎమైనా ఉన్న కోణంలో సోదాలు చేశారు. సరైన పత్రాల్లేని కార్లను, బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ ఆదేశాల మేరకు పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రూరల్ డిసిపి కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో వీరులపాడు మండలంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. నందిగామ ఎసిపి డాక్టర్ రవికిరణ్ నేతృత్వంలో వీరులపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొన్నవరం క్రాస్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. నందిగామ రూరల్ సిఐ చంద్రశేఖర్ నేతృత్వంలో ఉదయం నుంచి ఆకస్మికంగా సోదాలు జరిపారు. వీరులపాడు ఎస్ఐ మహా లక్ష్మణుడు విస్తతంగా వాహనాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని కార్లను, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మైలవరం సబ్ డివిజన్ (మిగతా 2లో)



మైలవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బి.వి.రాఘవులు, పి.మధు, పి.మురళీకృష్ణ, కె.స్వరూపరాణి, యు.వి.రామరాజు, టి.క్రాంతికిరణ్

మతోన్మాదంతో దేశ సమైక్యతకు ప్రమాదం

- అధికారం కోసం ప్రజల మధ్య బిజెపి చిచ్చు
- సుందరయ్య స్మారకోపన్యాసంలో బి.వి.రాఘవులు

వార్త మెయిన్లో

ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయాలి

అధికారులకు కృష్ణా కలెక్టర్ బాలాజీ ఆదేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దష్ట్యా రైతులకు గతంలో మాదిరిగా అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సోమవారం కలెక్టర్ సమావేశం నిర్వహించి వ్యవసాయ, ఉద్యాన, సూక్ష్మ సేద్య, నాచురల్ ఫార్మింగ్, పట్టు పరిశ్రమ, మత్స్య శాఖల కార్యక్రమాలపై సమీక్షించారు. తొలుత జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి జిల్లాలో సాగు భూములు, వాటి విస్తీర్ణం, నేలల స్వభావం, పండే పంటలు వాటి విస్తీర్ణం, భూగర్భ జలాల లభ్యత, కాలువలు, లిఫ్ట్ ఇరిగేషన్, చెరువుల ద్వారా సాగవుతున్న విస్తీర్ణం తదితర అంశాలు కలెక్టరుకు వివరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దష్ట్యా రైతులకు గతంలో మాదిరిగా అవసరమైన ఎరువులు విత్తనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో వరి విత్తన రకాలు, రైతులు ఎక్కువగా సాగు చేస్తున్న రకాల గురించి వ్యవసాయ శాస్త్రవేత్త గిరిజారాణి వివరించారు. ఆయా నేలల స్వభావాన్ని బట్టి అధిక దిగుబడులను ఇచ్చే రకాలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగు, వాటి విస్తీర్ణం గురించి జిల్లా ఉద్యాన శాఖ అధికారి జే.జ్యోతి వివరించారు. నాచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు అధికారి పార్థసారథి న్యాచురల్ ఫార్మింగ్ కార్యక్రమాలను వివరించారు. న్యాచురల్ ఫార్మింగ్ జిల్లాలో ప్రమోట్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలయ్యాక వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై క్షేత్రస్థాయి సిబ్బందితో ప్రతిరోజూ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా శాఖలకు చెందిన ప్రగతి సూచికలలో ఉత్తమ స్థానంలో ఉండేలా చూడాలన్నారు. ఈసమావేశంలో జిల్లా సూక్ష్మ సేద్య అధికారి జి.విజయలక్ష్మి, మత్స్యశాఖ జేడీ శివ సామ్రాజ్యం, మార్క్ఫెడ్ డిఎం మురళి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మూడ్నాళ్ల ముచ్చటేనా?

లోపభూయిష్టంగా 216 జాతీయ రహదారి నిర్మాణం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

నూతనంగా అభివృద్ధి చేసిన 216 జాతీయ రహదారి అప్పుడే బీటలు వారుతోంది. పనులు పూర్తవ్వకముందే రహదారిపై గోతులు పడుతున్నాయి. నూతనంగా నిర్మించిన వంతెనల అప్రోచ్‌లు కుంగిపోతున్నాయి. జాతీయ రహదారుల సంస్థ టోల్ వసూళ్లపై చూపిన శ్రద్ధ రహదారి నాణ్యతా ప్రమాణాలపై చూపకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోస్తా తీర ప్రాంత రహదారి 216 తూర్పు గోదావరి జిల్లా కత్తిపూడి నుంచి ఒంగోలు వరకు 381 కిలో మీటర్ల మేర అభివృద్ధి పనులను రూ.3,633 కోట్లతో చేపట్టారు. దీనిలో భాగంగానే కృష్ణాజిల్లాలో లోసరి నుంచి మచిలీపట్నంలోని మాచవరం వరకు, మచిలీపట్నం- అవనిగడ్డ వరకు రెండు ప్యాకేజీల్లో 65 కిలోమీటర్లు నాలుగు వరుసల రోడ్డుగా విస్తరించారు. కరోనా తర్వాత ఈ రెండు ప్యాకేజీల్లో రహదారి పనులు చాలా వరకు పూర్తయ్యాయి. దీనిలో భాగంగానే మచిలీపట్నం నూతన బైపాస్ వద్ద జాతీయ రహదారి 65ను క్రాస్ చేయడానికి వీలుగా రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబి) ని నిర్మించారు. మచిలీపట్నం-చల్లపల్లి మధ్యలో పొలిగిలిగండి, దాలిపర్రు అడ్డరోడ్డు వద్ద వాగులపై రెండు వంతెనలు నిర్మించారు. బంటుమిల్లి, పెడన, మచిలీపట్నం, లక్ష్మీపురం, చల్లపల్లి, కప్తానుపాలెం తదితర ప్రాంతాల్లో బైపాస్ రహదారులను ఏర్పాటు చేశారు.

నాణ్యతకు తిలోదకాలు

నల్లరేగడి, బుసక మట్టి కలిగి ఉన్న ఈ ప్రాంతంలో రహదారి సుదీర్ఘకాలం మన్నేలా ప్రణాళికలను రూపొందించారు. ఈ రహదారి నిర్మాణంలో కిలో మీటరుకు సగటున రూ.9 కోట్ల వరకు ఖర్చు పెట్టారు. అయితే కాంట్రాక్టు సంస్థ ఈ జాతీయ రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనే విమర్శలు వస్తున్నాయి. రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించినప్పుడు ఈ విమర్శలకు బలం చేకూరుతోంది. చల్లపల్లి-మచిలీపట్నం మధ్య అనేక ప్రాంతాల్లో రోడ్డు కుంగిపోయింది. ప్రతి ఐదు కిలోమీటర్లకు 100 మీటర్ల వరకు బీటలు వారింది. మచిలీపట్నం 10 కిలో మీటరు రాయి వద్ద, నూతన బైపాస్‌లో రోడ్డు భారీగా బీటలు వారింది. జాతీయ రహదారి 65ను క్రాస్ చేస్తూ నిర్మించిన ఆర్‌వోబి వద్ద, పొలిగిలిగండి, దాలిపర్రు సమీపంలో నిర్మించిన వంతెనల అప్రోచ్‌లు కుంగిపోయాయి. పొలిగిలిగండి గ్రామంలోనూ, వంతెన వద్ద రోడ్డుపై గోతులు పడ్డాయి. జాతీయ రహదారి సంస్థ పర్యవేక్షణ లేకపోవడంతోనే సుదీర్ఘకాలం ఉండాల్సిన రోడ్డు కొద్ది రోజులుకే బీటలు వారింది.



మచిలీపట్నం జాతీయ రహదారిపై నిర్మించిన హైలెవెల్ బ్రిడ్జి వద్ద బీటలు వారిన అప్రోచ్; పోలిగిలిగండి వద్ద బీటలు వారిన రోడ్

టోల్ బాదుడు

రహదారి విస్తరణ పనులు పూర్తయిన తర్వాతే టోల్ వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటికీ పెడన వద్ద రైల్వే వోవర్ బ్రిడ్జినిర్మాణం అసంపూర్తిగానే ఉంది. పెడన రైల్వే గేటు వద్ద వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బంటుమిల్లి మండలం ముంజులూరు, అవనిగడ్డ వార్పు వద్ద రెండు టోల్ ప్లాజాలు ఏర్పాటు చేశారు. వాహనదారులు నుంచి టోల్ వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ ప్రయాణీకుల టికెట్‌పైన ఈ టోల్ వసూళ్ళ భారం పడింది.



స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేసి సంతకం చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు

స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రతను పరిశీలించిన ఢిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఢిల్లీ రావు సోమవారం పరిశీలించారు. ఇబ్రహీంపట్నంలోని నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రతపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎంలకు కేంద్ర, రాష్ట్ర, సివిల్ పోలీసులతో ప్రభుత్వం మూడు అంచెల భద్రత కల్పించిందన్నారు. స్ట్రాంగ్ రూములకు ఉన్న తలుపులకు వేసిన తాళాలను, తాళాలకున్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిష్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. మూడంచెలు గల కేంద్ర పోలీసు బలగాల గార్డును, జిల్లా ఆర్మ్డ్ పోలీసు గార్డు, సివిల్ పోలీసు బందోబస్తులను పరిశీలించారు. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూంలు ఉన్న ప్రాంతంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరాదన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని విధాల జాగ్రత్తలు తీసుకుంటూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఢిల్లీ రావు అన్నారు.

56 మందికి జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : మద్యం సేవించి వాహనాలు నడిపిన 56 మందికి జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. 6వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 56 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహనచోదకులను సోమవారం రైల్వే కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఆర్.వి.శర్మ 28 మందికి ఒక్కొక్కరికి మూడు రోజులపాటు జైలు శిక్ష, మిగిలిన 28 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

హోర్డింగ్‌లపై విఎంసి కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : హోర్డింగ్ల వల్ల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం విఎంసి ప్రధాన కార్యాలయం నూతన భవనంలోని మీటింగ్ హాల్‌లో ఏజెన్సీ ప్రతినిధులు, ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ హోర్డింగ్ల నాణ్యతను ధ్రువీకరించి స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్‌ను ఖచ్చితంగా ప్రతి ఏజెన్సీ హోర్డింగ్ పెట్టేముందు తీసుకోవాలన్నారు.



అమ్మ ప్రేమను కళ్లకట్టిన చిన్నారులు

చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సృష్టిలో అమ్మ ప్రేమ అనే అంశంపై నిర్వహించిన గరిమెళ్ళ సుబ్బారావు స్మారక చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన లభించింది. నగరానికి చెందిన ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ స్టూడెంట్స్ వింగ్ ఆధ్వర్యంలో గరిమెళ్ళ నానయ్య చౌదరి సహకారంతో...1 నుంచి 10వ తరగతి చదువుతున్న చిన్నారులకు సితార సెంటర్లోని సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్-2024లో ఆదివారం రాత్రి జరిగిన సృష్టిలో అమ్మ ప్రేమ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నగరం నలుమూలల నుంచి రెండు వందలకుపైగా చిన్నారులు పాల్గొన్నారు. తమ చిట్టిచిట్టి చేతులతో అమ్మ ప్రేమని కల్లకు కట్టినట్లుగా చిత్రించి ఆహుతులను అలరించారు. అనంతరం జరిగిన బహుమతి



ప్రదానోత్సవంలో ఎగ్జిబిషన్ ఇన్చార్జి బాలాజీ, కల్చరల్ ఈవెంట్స్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ వర్కింగ్ కమిటీ మెంబెర్స్ సునీల్ కుమార్ అనుమకొండ, గిరిధర్ అరసవల్లి, స్ఫూర్తి శ్రీనివాస్, రమేష్ అర్కాల, సంధ్యారాణి, మేడా రజని చేతుల మీదుగా విజేతలకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి శ్రావణ్ కుమార్, లలితా సౌజన్య, బి.వి.ఎమ్.బి.లోకేష్, లక్ష్మీ ప్రియాంక ఈవెంట్ ఆరగనైజర్లుగా వ్యవహరించారు. కాంటెస్ట్ కోఆర్డినేటర్లు గోపీ మనోజ్, ప్రవీణ్ కుమార్, దేవేష్, నదియా, హిమజ, స్ఫూర్తి స్వేచ్ఛ, సింధూ శ్రీ, నవ్య శ్రీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



స్వయంభు క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలపై చర్చలు

రెండు రోజుల్లో పెండింగ్ వేతనాల చెల్లింపునకు యాజమాన్యం హామీ

ప్రజాశక్తి - విజయవాడ : స్వయంభు క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారంపై మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కొత్త గవర్నమెంట్ హాస్పిటల్ సమీపంలోని శ్రీనివాస బ్యాంక్ కాలనీ ఫస్ట్ రోడ్డు స్వయంభు ఆఫీస్ వద్ద యాజమాన్యంతో చర్చలు జరిగాయి. ఈచర్చల్లో యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ నగరవ్యాప్తంగా 250 క్లాప్ ఆటోలు నడుస్తున్నాయని, ఈ 250 మంది క్లాప్ ఆటోడ్రైవర్లు ఐదు రోజుల నుండి బళ్లు ఆపి నిరసన తెలియజేస్తున్నారని వివరించారు. కనీసం పెండింగ్ వేతనాలైనా విడుదల చేయకుండా, రూ.18,500లకు జీతం పెంచకుండా ప్రభుత్వాధికారులు, యాజమాన్యం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడం తగదన్నారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ వర్తింపజేయాలని, ప్రతి నెలలో నాలుగు రోజులు వీక్లీ ఆఫ్‌లు, స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బండి డామేజైతే డ్రైవరే బాధ్యత వహించాలనడం సరికాదని, యాజమాన్యమే బాధ్యత వహించాలని తదితర డిమాండ్లపై చర్చలు జరిగాయి. స్వయంభు యాజమాన్యం బాధ్యులు విజయ్ మాట్లాడుతూ రెండు రోజుల్లో పెండింగ్ వేతనాలు ఇస్తామని, మిగిలిన విషయాలు వచ్చే నెల 15కల్లా పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ చర్చల్లో యూనియన్ సిటీ ఆర్గనైజర్ టి.ప్రవీణ్, నగర కోశాధికారి డి.స్టీఫెన్ బాబు, క్లాత్ ఆటో డ్రైవర్ల బాధ్యులు కిరణ్ శివ, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యంలో శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నర్‌పేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో కూచిపూడి నత్య శిక్షణ, పుస్తక సమీక్ష నిర్వహించారు. 'చదవటం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. బి.వి.ఎస్.ఆర్.కె.శర్మ నత్య శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో ప్రారంభ స్తుతులు సాధన చేయించారు. ప్రాథమిక అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కే.రమాదేవి, వేదాంతం పాండురంగ శర్మ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిన్నారులకు శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ : సత్యనారాయణపురంలోని చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం తరగతులలో భాగంగా విద్యార్థులతో నీతి కథలు, దేశ నాయకుల చరిత్రలను చదివించారు. అనంతరం వారితో చెప్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ టి.సుబ్బన్న మేథమేటిక్స్‌లో, సోషల్ సీనియర్ టీచర్ (కేంద్రీయ విద్యాలయం) ప్రపంచ పటం, దానిలోని అంశాలు, స్టోరీస్ అడ్వైజర్ కె.కనక దుర్గా దేవి నీతి కథలు, విశ్రాంత లెక్చరర్ బి. సావిత్రి తెలుగు డిక్టేషన్, ధ్యానంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులకు చైర్స్ గేమ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ పాల్గొన్నారు.

తెలుగు వారి తెగువకు నిదర్శనం 'ఆంధ్రకేసరి' : మల్లాది

ప్రజాశక్తి - విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఎంతో ఆదర్శనీయమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. టంగుటూరి వర్ధంతి సందర్భంగా నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద సోమవారం టంగుటూరి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ ప్రదేశాల వద్ద నో ఫ్లయింగ్ జోన్

(మొదటి పేజీ తరువాయి)

ఎసిపి ఎస్.మురళీమోహన్ మైలవరంలో విజయవాడ బైపాస్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని హెచ్చరించారు. వెనుక నుండి రెచ్చగొట్టే పనులు, కవింపు చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉందని, కవ్వింపు చర్యలకు పాల్పడే వారి వివరాలను సేకరించామని, అసాంఘిక శక్తులను ఉపేక్షించేది లేదని అన్నారు. పెట్రోల్ బంకులు, గ్రామాల్లో బడ్డీ కొట్లు, పాన్ షాపుల్లో లూజు పెట్రోల్ విక్రయాలు జరుగుతున్నాయని, అలా అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిఐ కిషోర్ బాబు, ఎస్ఐ హరిప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తిరువూరు పట్టణంలో ఆదివారం రాత్రి నుండి సోమవారం సాయంత్రం వరకు ఎసిపి పర్యవేక్షణలో సిఐ అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ఎటువంటి పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.



తిరువూరులో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు



వీరులపాడు మండలంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుపై డెమో



ఓట్ల లెక్కింపుపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : సాధారణ ఎన్నికలకు సంబంధించి జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు సజావుగా, వేగంగా జరిగేందుకు అధికారులు కషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో స్పందన మీటింగ్ హాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ డెమో నిర్వహించారు. డెమో పరిశీలించిన జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచన చేశారు. ఓట్ల లెక్కింపు త్వరగా వేగంగా జరిపి ఫలితాలు ప్రకటిస్తే అధికారులపై ఒత్తిడి తగ్గుతుందనే ఉద్దేశంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు డెమో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ డెమో కార్యక్రమానికి వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు హాజరై పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ పరిశీలించారు. ఆయా నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ సహాయక రిటర్నింగ్ అధికారులు ఈ డెమోకు హాజరై ఓట్ల లెక్కింపు ప్రాక్టీస్ చేశారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన పోస్టల్ బ్యాలెట్ సంఖ్యను బట్టి 500 ఓట్లకు ఒక్కొక్క టేబుల్ చొప్పున ఏర్పాటు చేయాలని, తద్వారా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వేగవంతం కాగలదని కలెక్టర్ అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తిరస్కరించిన, చెల్లని ఓట్లకు సంబంధించి కారణాలు స్పష్టంగా పేర్కొనాలని కలెక్టర్ సూచించారు. డిఆర్ఓ కే.చంద్రశేఖరరావు, గుడివాడ, మచిలీపట్నం, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఆర్డీవోలు పి. పద్మావతి, ఎం వాణి, డి రాజు, పెడన, అవనిగడ్డ, పామర్రు రిటర్నింగ్ అధికారులు పీ. వెంకటరమణ, బాలసుబ్రమణ్యం, శ్రీదేవి పాల్గొన్నారు .



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

ప్రతిఒక్కరూ కలసిమెలసి ఉండాలి : సిఐ

ప్రజాశక్తి-చల్లపల్లి : అల్లర్లకు ఊతమిచ్చే విధంగా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని చల్లపల్లి తహసీల్దార్ బి.సుమతి హెచ్చరించారు. సోమవారం చల్లపల్లి తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం పెట్రోల్ బాంక్ యజమానులు, హెూల్ సేల్ టపాసుల అమ్మకందారులతో సమావేశాన్ని నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ విడిగా బాటిల్స్, టిన్నుల ద్వారా అమ్మకాలను తక్షణమే ఆపేయాలని హెచ్చరించారు. చల్లపల్లి సీఐ సీహెచ్.నాగ ప్రసాద్ మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ విడి అమ్మకాలను ఆపివేయడంతో పాటు టపాసుల అమ్మకాలను సైతం నిలిపివేయాలన్నారు. గ్రామాలలో అనుమానాస్పదంగా సంచరించువారు, కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్తతతో వ్యవహరిం చాలని పేర్కొన్నారు. ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా పరస్పర సహకారంతో కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇంచార్జి ఆర్ఐ ఘంటసాల కష్ణమోహన్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, సేవాభావం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి ఉయ్యూరు : ఎన్‌సిసి క్యాడెట్లు క్రమశిక్షణతో పాటు సేవాభావం అలవరుచుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని రెడ్ క్రాస్ ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్స్ , ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్ అన్నారు. శ్రీవిశ్వశాంతి స్కూల్ ఆవరణలో ఎన్సీసీ కాకినాడ బెటాలియన్ ఆ. ద్వర్యంలో వివిధ జిల్లాలనుంచి వచ్చిన 700 మంది ఎన్సీసీ క్యాడెట్లకు పదిరోజుల శిక్షణలో భాగంగా ప్రథమ చికిత్స, సీపీఆర్ పద్ధతులు, రక్తదాన ఆవశ్యకతపై రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. విపత్తులు, అత్యవ సర పరిస్థితుల్లో ఎన్సీసీ ముందుటున్న విదంగానే రక్తదానంలో ఇతర యువకులకు ఆదర్శంగా ఉండాలన్నారు. రక్తదాన ఆవశ్యతపై రెడ్ క్రాస్ అధికారులు శంకరనాథ్, అన్నమ్మ శిక్షణ నిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు పూనుకోవాలని, రెడ్ క్రాస్ యాప్ ద్వార రెడ్ క్రాస్ వలంటీర్ నమోదుచేసుకోవాలని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బా లాజీ సూచించారు. ఎన్సీసీ బెటాలియన్ అధికారి అజిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్ క్రాస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-గన్నవరం : జిల్లా ఎస్. పి అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాల మేరకు, గన్నవరం డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో సోమవారం సమస్యాత్మక గ్రామం అయిన తేలప్రోలు గ్రామాన్ని సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున హైస్కూల్ వద్ద జరిగిన గొడవకు సంబంధించి, గొడవలో పాల్గొన్న అందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల ఫలితాలను పురస్కరించుకుని ప్రజలు అందరూ సహకరించాలని రాజకీయ ప్రలోభాలకు లోనై ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు లకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షణిక ఆవేశానికి లోనై గొడవలు పడటం వల్ల వారిపై కేసులు నమోదు అయి తర్వాత,ఇబ్బందులు పడతారని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ సీఐ నవీన్ నరసింహమూర్తి, ఆత్కూరు ఎస్సై పైడి బాబు, సిబ్బంది, తేలప్రోలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి జయసూర్య

క్రీడాకారులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నియోజకవర్గంలోని క్రీడాకారులను ప్రోత్సహించడంలో తాను అన్నివేళలా ముందే ఉంటానని మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. సోమవారం స్థానిక కొడాలి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రెల్లి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజమండ్రిలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే గుడివాడ క్రీడాకారులకు ఎమ్మెల్యే నాని శుభాకాంక్షలు తెలిపి, గుడివాడ నుండి పోటీల్లో పాల్గొనే మూడు జట్లకు క్రికెట్ స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొంకితల ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.



క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్‌ను అందజేస్తున్న కొడాలి నాని



విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం గూడూరు-1 అర్‌బికె పరిధిలో సోమవారం రైతులకు జీలుగ, పిల్లిపెసర విత్తనాలు సబ్సిడీ పై అందించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి జి వి శివప్రసాద్ మాట్లాడుతూ జీలుగ, జనము కిలో 44 రూపాయలు గా సబ్సిడీ ధరతో ఎకరాకు 10 కేజీలు చొప్పున, గరిష్టంగా 5 ఎకరాలకు మాత్రమే ఇస్తున్నట్లు తెలిపారు. పిల్లిపెసర కేజీ 67 రూపాయలు సబ్సిడీ పై ఎకరాకు 10 కేజీలు ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రభాకర్, కుమార్ రైతులు పోతన రాధాకష్ణ, మాగంటి శ్రీనివాస్, పెదశనగంటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదానం పథకమునకు గూడూరుకు చెందిన అన్నం శ్రీకష్ణ తేజ, తేజస్వి పేర్ల మీద వారి తల్లిదండ్రులు అన్నం హరిరామకృష్ణ, అరవింద, కుటుంబ సభ్యులు 1,00,116 రూపాయలు సోమవారం అందజేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావుకి విరాళం అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.



టంగుటూరికి నివాళి



మచిలీపట్నంలో...



అవనిగడ్డలో...

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర కేసరి, తెలుగుజాతి గర్వించదగిన నేత, ఆంధ్ర రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి, స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు అని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం వి, బాబా ప్రసాద్ కొనియాడారు. టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి సందర్భంగా స్థానిక వెంకటేశ్వర కాంప్లెక్స్ ఆవరణలో స్వర్గీయ ప్రకాశం పంతులు చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనమైన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బాబా ప్రసాద్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామం సమయంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చూపిన ధైర్య సాహసాలు దేశం గర్వించ దగినవని గుర్తు చేశారు. ఏకాగ్రతతో విద్యాభ్యాసాన్ని సాగించిన ప్రకాశం పంతులు 1907 వ సంవత్సరంలో లండన్ లో బారిష్టర్ కోర్సు పూర్తిచేసుకుని న్యాయవాదిగా అత్యున్నత స్థానాన్ని అధిరోహించి లక్షలాది రూపాయలు ధనార్జన చేశారని దీన్నంతటిని దేశ సేవ కోసం ఖర్చు చేశారన్నారు. స్వాతంత్ర సమరంలో నిర్వహించిన ప్రతి ఉద్యమాలలోనూ స్వర్గీయ ప్రకాశం పంతులు ముఖ్య పాత్ర వహించి, మహాత్మా గాంధీ వంటి పెద్దల మెప్పు పొందారన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు రాజకీయ జీవితం రాజమండ్రి పురపాలక సంఘ అధ్యక్షునిగా ప్రారంభమై, 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మనకి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసి అతి తక్కువ కాలంలోనే ఎన్నో అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసి ప్రజల హదయాలలో ఇప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జీవితాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రకాశం పంతులు జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి విద్యాసాగర్ , పి. వి. ఫణి కుమార్, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, సుంకర నరసింహారావు, బొడ్డు నాగరాజు, గుమ్మడి విద్యాసాగర్,వెన్న ఫణి రాజ్, సూరిశెట్టి హరికష్ణ, డి సుబ్బారావు, జుజ్జురి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి ముఖ్యమంత్రి, కీర్తిశేషులు టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూ రి వెంకటేశ్వరరావు, బచ్చు రఘునాథ్, బిజెపి నాయకులు శోభిల ఏడుకొండలు, టిడిపి నాయకులు మండల రామ్మోహన్రావు, చందన నరసింహారావు, ఎలవర్తి చిన్న, మెగావత్ గోపి, మెరుగు సోమిరెడ్డి, దాసినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు



మట్టి తరలిస్తున్న వాహనం

యధేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని రంగాపురం, అన్నేరావుపేట, రెడ్డిగూడెం, మద్దులపర్వ తదితర ప్రాంతాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు, అక్రమంగా నిల్వ ఉంచిన మట్టి తరలింపు విపరీతంగా సాగుతోంది. పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఎన్నిసార్లు పట్టుకొని జరిమానా విధించినా ఈ అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట పడే అవకాశం కనిపించడం లేదు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా ఎక్కడో లోపం, కొంతమంది అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా ఈ మట్టి దోపిడీ యధేచ్ఛగా కొనసాగుతుంది. కనుక కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, మట్టి దోపిడీని అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇక రెడ్డిగూడెం పోలీసులు మాత్రం అక్రమ మట్టి తవ్వకాల లారీ, ట్రాక్టర్‌లను పట్టుకుని ఫైన్ వేసి వదిలేశారు.

భవానీపురంలో స్పీడ్ బ్రేకర్లకు మార్కింగ్

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - భవానీపురం

భవానీ పురంలోని ప్రధాన రహదారి అయిన చర్చి సెంటర్ నుండి స్వాతి సెంటర్‌కు వెళ్ళ మార్గంలో డివైడర్‌కు రెండు వైపులా ఇటీవల నగరపాలక సంస్థ అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేశారు. అయితే వాహనదారులు అతి వేగంగా వెళ్ళకుండా అడ్డుకట్ట వేసేందుకు ప్రమాదాలు జరక్కుండా ఉండే ఉద్దేశ్యంతో నిర్మించిన స్పీడ్ బ్రేకర్లు వేసిన అధికారులు ఆ స్పీడ్ బ్రేకర్లపై మార్కింగ్ గీతలు లేకుండా వదిలేశారు. దీనిపై ఈనెల 15వ తేదీ 'ప్రజాశక్తి'లో స్పీడ్ బ్రేకర్లపై మార్కింగ్ వేయరూ... అన్న కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన విఎంసి అధికారులు, స్థానిక 42వ డివిజన్ కార్పొరేటర్ పడిగపాటి చైతన్య రెడ్డి ఈ ప్రాంతంలో వేసిన స్పీడ్ బ్రేకర్లపై వైట్ గీతలతో మార్కింగ్ చేశారు. దీంతో అటుగా ప్రయాణించే ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ఇబ్బందులు తొలగాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



స్పీడ్ బ్రేకర్లపై మార్కింగ్ లేకుండా వదివేసిన అధికారులు (ఫైల్)



స్పీడ్ బ్రేకర్లపై మార్కింగ్ వేసిన అధికారులు (ప్రస్తుతం)

చిట్టినగర్‌లో కూడా...

అయితే చిట్టినగర్ తదితర ప్రాంతాలలో కూడా ఇదే విధంగా స్పీడ్ బ్రేకర్లు వేశారు. వాటిపై కూడా వాహనదారులకు స్పీడ్ బ్రేకర్ కనబడే విధంగా మార్కింగ్ చేయాలని పలువురు కోరుతున్నారు.

మన్నెం జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి - నందిగామ : నందిగామ వైసిపి కార్యాల యంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మన్నెం దాసు జన్మదినం సంద ర్భంగా ప్రత్యేకంగా కేక్ కట్ చేయించారు. శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు, దాసుకు శుభాకాంక్షలు తెలిపారు. చందర్లపాడు మండలంలోని కాండ్రపాడు గ్రామంలో వైసిపి నాయకులు కొండా కృష్ణా రెడ్డి తండ్రి కొండా వీరారెడ్డి సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టిడిపి, వైసిపి నోట్ల రాజకీయం చేశాయి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు



పర్యటనలో బాబూరావు

ప్రజాశక్తి - అజిత్ సింగ్‌నగర్ : సెంట్రల్ సిటీ సింగ్‌నగర్ రాజరాజేశ్వరి పేటలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు సిపిఎం నేతలతో కలిసి రాజరాజేశ్వరి పేటలో ఇంటింటికి తిరిగి తమకు మద్దతు తెలిపినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ టిడిపి, వైసిపి నాయకులు నోట్ల రాజకీయాలు చేశారు. నీతిమాలిన కబుర్లు చెబుతూ ప్రజలకు విచ్చలవిడిగా డబ్బులు పంచారు. ఎన్నికల అనంతరం అధికార ప్రతిపక్ష నాయకులు విదేశాల్లో ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ఎంజాయ్ చేస్తున్నారని ప్రజా సమస్యలు గాలికి వదిలేశారని రాష్ట్రంలో హింస చెలరేగిపోతుందని ఎన్నికల అనంతరం బ్లేడు బ్యాచ్ చెలరేగిపోతున్నారని ప్రజా సమస్యలు పట్టించుకోకుండా నాయకులు ఎన్నికల కోడ్ ఉందని చెప్పడం దారుణని అమన్నారు. అత్యవసర పనులకు ఎన్నికల కోడ్ సంబంధం ఏంటని ప్రశ్నించారు. కరెంట్ బిల్లు ఇంటి బిల్లు చెత్త పన్ను కట్టించుకోవడానికి ఎన్నికల కోడ్ అడ్డం రాదా అని ప్రశ్నించారు. ఎన్నికలు అవగానే చెత్త పన్ను వసూలు చేయాలని అధికారులు మున్సిపల్ కార్మికులపై వత్తిడి చేస్తున్నారని వాటిని వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. తడి పొడి చెత్త తరలించే వాహనదారులు డ్రైవర్లు గత నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నా నాయకులు అధికారులు పట్టించుకోవటం లేదని వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. సంక్షేమ పథకాలకు డబ్బులు లేవు గాని ఎలక్షన్‌లో పంచడానికి డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు చెప్పాలన్నారు. సిపిఎంకు ఎన్నికల్లో మద్దతు తెలిపిన కుటుంబాలకు అభినందనలు తెలియ జేస్తున్నామని, ఎన్నికల అనంతరం కూడా నిత్యం ప్రజల సమస్యలపై ప్రజల కోసం ప్రజలకు అందుబాటులో ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు సిపిఎం నాయకులు ఎస్‌కె.పేరు, చింతల శ్రీనివాస్, ఆర్‌ఆర్‌పేట డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ కార్యకర్త శివరామకృష్ణ సంతాప సభ



సంతాప సభలో పాటలు పాడుతున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరువూరు : సిపిఎం సీనియర్ కార్యకర్త దమ్మాలపాటి శివరామకృష్ణ సంతాప సభ తిరువూరులోని సుందరయ్య కాలనీలో సోమవారం కూరపాటి వెంకటరత్నం అధ్యక్షతన జరిగింది. అయన చిత్రపటానికి పార్టీ నాయకులు గుళ్ళ పల్లి వెంకటరత్నం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఎస్.వెంకటేశ్వర్లు, పి.తులసీరాణి, ఏం.నాగమణి, రాణి తదితరులు అమర వీరుల గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ 2వేలు సంవత్సరంలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన పోరాటంలో శివరామకృష్ణ, ఆయన సతీమణి నాగేంద్రమ్మ పాత్ర మరువలేన్నారు. ఆ ఫలితమే ఈ సుందరయ్య కాలనీ ఏర్పాటు అన్నారు. ఆనాడు ప్రభుత్వం పోలీసులను రంగంలో దింపి ఉద్యమాన్ని భగ్నం చేయాలని చేసిన ప్రయత్నాన్ని ప్రజలకు అండగా పార్టీ కార్యకర్తలు నిలబడి తిప్పుకొట్టారని చెప్పారు. శివరామకష్ణ తన ఇద్దరు కుమారులకు కులాంతర వివాహాలు చేయించి అందరికీ ఆదర్శంగా నిలిచారని నాగేశ్వరరెడ్డి కొనియాడారు.

కోరం లేక ఇబ్రహీంపట్నం మండల సమావేశం వాయిదా



ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండల పరిషత్ సమావేశం సోమవారం కోరం లేక వాయిదా పడింది. ఈ సమావేశాన్ని వైసీపీ ఎంపీటీసీలు బహిష్కరించడం తో సమావేశంలో కోరం సరిపోలేదు. ఇటీవల ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఎంపీపీ పార్టీ మారిన తరువాత మొదటి మండల సమావేశం సోమవారం జరిగింది. వైసీపీలో గెలిచి టీడీపీలో చేరినందుకు నిరసనగా సమావేశాన్ని వైసీపీ ఎంపీటీసీలు బహిష్కరించినట్లుగా తెలుస్తుంది. దీంతో కోరం లేక మండల పరిషత్ సమావేశం రెండు సార్లు వాయిదా పడింది. ఇక చేసేది లేక ఎంపీడీవో వి.ఉమాదేవి ఇబ్రహీంపట్నం మండల పరిషత్ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తదుపరి సమావేశం ఎప్పుడో ప్రకటిస్తాం అన్నారు. సమావేశానికి గైర్హాజరైన ఎంపీటీసీ సభ్యులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. కో - ఆప్షన్ సభ్యుడు సమావేశానికి హాజరు కాలేనని ముందుగానే సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సమావేశానికి ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, వైస్ ఎంపీపీ - 1 బండి నాగమణి, తుమ్మలపాలెం ఎంపీటీసీ పోలిశెట్టి తేజ హాజరయ్యారు. తాను పార్టీ మారినందువల్లే వైసీపీ ఎంపీటీసీలు సమావేశం బహిష్కరిస్తున్నారన్న విషయం తన దృష్టికి రాలేదని ఎంపీపీ జ్యోత్స్న తెలిపారు.

'ఎంపిపి జ్యోత్స్న రాజీనామా చేయాలి'



మాట్లాడుతున్న సాంబశివరావు, తదితరులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం ఎంపిపి పాలడుగు జ్యోత్స్న పదవికి రాజీనామా చేయాలని ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జడ్పీ వైస్ చైర్ పర్సన్ గరికపాటి శ్రీదేవి, వైసీపీ మండల అధ్యక్షుడు బొంతా సాంబశివరావు డిమాండ్ చేశారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన ఎంపీపీ జ్యోత్స్న మండల పరిషత్ సమావేశానికి అధ్యక్షత వహించేందుకు అర్హత లేదన్నారు. ఫ్యాను గుర్తుపై విజయం సాధించిన జ్యోత్స్నకు విలువలు ఉంటే ఎంపీటీసీ సభ్యత్వానికి, ఎంపీపీ పదవికి రాజీనామా చేసి సైకిల్ గుర్తుపై పోటీ చేసి గెలవాలి అని సవాలు విసిరారు. 11 మంది సభ్యుల్లో 8 మంది వైసీపీ సభ్యులు సోమవారం జరిగిన మండల పరిషత్ సమావేశాన్ని బహిష్కరించారని, ఎంపీపీ జ్యోత్స్న నిబద్ధత లేకుండా పార్టీ మారారని మండిపడ్డారు. ఫ్యాను గుర్తుపై గెలిచి వైసీపీని మోసం చేసి టీడీపీలో చేరిన జ్యోత్స్న మండల సమావేశానికి అధ్యక్షత వహిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బాణావత్ నాగ బాలమ్మ, కేతనకొండ ఎంపీటీసీ - 1 పులి సువర్ణ రాజు, కేతనకొండ ఎంపీటీసీ - 2 కొమ్మూరు రామకోటేశ్వరరావు (బాలా), మూలపాడు ఎంపీటీసీ సభ్యురాలు గొట్టుముక్కల రాధ, దాములూరు ఎంపీటీసీ ఉప్పులూరు నాగేశ్వరరావు, కాచవరం ఎంపీటీసీ ముద్దంగుల రంగస్వామి, కో -ఆప్షన్ సభ్యుడు పఠాన్ నాగుల్ మీరా, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



నెట్టెంకు శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం

నెట్టెంకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - నందిగామ :

తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం జన్మదిన సందర్భంగా సోమవారం నందిగామ మండలంలో టిడిపి నాయకులు మన్నే కళావతి, తోట నాగమల్లేశ్వరరావు, శాఖమూరి సరోజిని, చెరుకూరు వాసు లు రఘురాం స్వగహంలో ఆయన కలిసి పుష్పగుచ్ఛం తో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఇనాం భూముల రైతు సంఘం అధ్యక్షులు రాటకొండ రామ కోటేశ్వరరావు, తదితరులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ :

నందిగామ మెయిన్ రోడ్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీతారామయ్య సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశారు. అయ్యప్ప సేవా సమితి ద్వారా దేవాలయాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, 15 సంవత్సరాలుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రతిరోజు మధ్యాహ్నం టైంలో మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందని ఇలాంటి మంచి కార్యక్రమాలు చేసే వారికి ప్రజలు సహకరించాలని సీతారామయ్య కోరారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు మహంకాళి వెంకన్న గురుస్వామి, యాత్రికులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - నందిగామ :

నందిగామ మండలం సత్యవరం, పల్లగిరి గట్టుపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నారసింహస్వామి 32వ వార్షిక బ్రహ్మోత్సవాలకు దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. మూడు రోజులపాటు ఆలయం వద్ద వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 21వ తేదీమంగళవారం సాయంత్రం విశ్వక్సేన పూజ అంకురారోపణం, ధ్వజారోహణం వాస్తు పూజ, 23 రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ నారసింహస్వామి దివ్య కళ్యాణం, 24వ తేదీ సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పబ్బతి నరసింహారావు, కార్యదర్శి కొత్త వేణుమాధవులు తెలిపారు. మాగల్లు గ్రామంలో శ్రీ వైకుంఠ నారాయణ క్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు అంగర రాంబాబు తెలిపారు.



మత్స్యకారుల జీవితాలకు భరోసా ఇవ్వడంలో నేటి ప్రభుత్వాలు విపలమౌతున్నా యనే విమర్శలు ఆయ వర్గాల నుండి వినబడుతున్నాయి. వేట నిషేధ సమ యంలో ఇచ్చే అరకొర సహాయం కూడా సమయానికి ఇవ్వకపోవడంతో జిల్లాలో వేటపై ఆధారపడ్డ మత్యాకారుల కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్యకారులకు ప్రతి ఏడాది వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందించే నిషేధ భతి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు అందించలేదు. దీంతో ఆయా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొం టున్నారు. ప్రభుత్వం వేటపై నిషేదం విధించి నెల రోజులు దాటినా ఇప్పటివరకు పరిహారం అందలేదు . వేటను నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులు కుటుంబపోషణ బారంగా మారిందని పలువురు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారులకు ఏదీ 'భరోసా'

- నిషేధం విధించి నెలదాటినా అందని వేట నిషేధ భృతి
- ఆర్థిక ఇబ్బందులూ ఎదుర్కొంటున్న కుటుంబాలు



ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సముద్ర జలాల్లో మత్స్య సంపద వద్ధి కొరకు ప్రతి ఏడాది ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకూ అనగా 60 రోజుల పాటు సముద్రంలో చేపలవేటపై నిషేధం విధిస్తాయి ప్రభుత్వాలు. కృష్ణా జిల్లాలో 25 మండలాల్లో 4 తీరా ప్రాంత మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల పరిధిలో 111 కిలో మీటర్ల సముద్ర తీరం ఉంది . ఈ ప్రాంత పరిధిలో సుమారు మోటరైజ్డ్,మేకనైజ్డ్ బొట్లు కలిపి నూటయాభై నుండి రెండు వందల వరకు ఉన్నాయి .వీటి పరిధిలో సుమారు 15 వేల మంది వేట సాగిస్తారు. వేట పై ఆధారపడ్డ మాత్యకారుల వివరాలు సేకరించి ప్రతి ఏడాది వేట నిషేధ సమయంలో నిషేధ భతి ఇస్తుంది ప్రభుత్వం. వివరాల సేకరణ ప్రతి ఏడాది ఏప్రిల్ నెలలో ముగుస్తుంది.అయితే ఈ ఏడాది ఈ ప్రక్రియ ఇప్పటి వరకు పూర్తి కాలేదు. ఇందుకు ఎన్నికల ప్రక్రియ సాకుగా చూపుతున్నారు ప్రజా ప్రతినిధులు, అధికారులు ,వేట నిషేధ సమయంలో ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ. పదివేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుంది. ఈ ఏడాది 12,800 వేల కుటుంబాలకు పరిహారం అందించేందుకు ప్రస్తుతం అధికారులు ప్రాథమిక అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదం కొరకు పంపించారు.అక్కడ ఆమోద ముద్ర పడిన తర్వాత అర్హుల జాబితాలను సచివలయల వారీగా ప్రకటిస్తారు. వీటిలో ఏమైనా అభ్యంతరాలు వెల్లువెత్తితే వాటిని మరోమారు ఉన్నతాధికారులకు పంపి తుది జాబితా వచ్చిన తర్వాత అర్హుల బ్యాంక్ ఖాతా ల్లో నిధులు జామ చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి అవ్వడానికి సుమారు నెలరోజులు సమయం పడుతుంది. ఈలోగా నిషేధ గడువు కూడా పూర్తవుతుంది.అయిన లబ్ధిదారులకు మాత్రం భతి నిధులు జామ కావు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటివరకు వేట నిషేధ గడువుకు ముందే భతి నిధులు జామ చేస్తూ వచ్చారు. అయితే ఈ ఏడాది మాత్రం ఇప్పటివరకు అర్హుల జాబితానే సిద్ధం చేయలేదు. దీంతో ఈ ఏడాది పరిహారం ఎప్పటికి ఇస్తారో అధికారులే చెప్పలేక పోతున్నారు. దీనివల్ల వేటపై ఆధారపడి జీవిస్తున్న మాత్యకారులు కుటుంబ పోషణ భారంగా మారినట్లు పలువురు అవేదన వ్యక్తం చేస్తున్నారు.



వేట లేకపోవడంతో నిలిచిన బోట్లు (ఫైల్)

పెరిగిన నిత్యవసరాలతో ఇబ్బందులు

ఓ వైపు నిత్యావసర వస్తువుల ధరలు విపరీ తంగా పెరుగుతున్నాయి. గత టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.నాలుగు వేలు పరిహారం ఇవ్వగా ప్రస్తుత వైకాపా ప్రభుత్వం దానిని రూ. రూ.పది వేలకు పెంచింది. అయితే నిబంధనలు కఠినతరం చేయడంతో లబ్ధిదారుల సంఖ్య ప్రతి ఏడాది తగ్గిపోతూ వస్తుంది. పెరిగిన ధరలతో పోల్చితే ఈ పరిహారంతో రెండు నెలలు గడపడం అసాధ్యమని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇచ్చే అరకొర సహాయం కూడా సమయానికి ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

కుటుంబాలను ఏ విధంగా పోషించుకోవాలి

తమకు వేట తప్ప మరో పని చేయలేమని తెలిసి కూడా ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోతే తాము కుటుంబాలను ఏ విధంగా పోషించుకోవాలని ప్రశ్నిస్తున్నారు.ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ కొరకు కొంతమంది అప్పులు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి ఎటువంటి నిబంధనలు పెట్టకుండా మాత్య కార భరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సంకాబత్తుల వెంకట్‌కు రోటరీ ఇంటర్నేషనల్ అవార్డు

ప్రజాశక్తి-గన్నవరం : సమాజానికి అద్భుతమైన సేవలను అందిస్తున్న కష్ణా జిల్లా గన్నవరం మండలం దావాజిగూడెం చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఛైర్మన్ సంకాబత్తుల వెంకట్ కి రోటరీ గవర్నర్ సుబ్బారావు చేతులు మీదుగా సోమవారం రోటరీ ఎక్సలెంట్ ఆఫ్ సర్వీస్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కష్ణా జిల్లా రోటరీ గవర్నర్ సుబ్బారావు రావురి మాట్లాడుతూ గన్నవరం ప్రాంతంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో సమాజానికి అత్యున్నతమైన సేవలను అందించడమే కాకుండా,దివ్యాంగుల కొరకు స్పందన మానసిక వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఉచితంగా విద్యా వైద్య రవాణా భోజన సౌకర్యం అందించడం చాలా గొప్ప సేవని ఆయన అన్నారు. కరోనా క్లిష్టమైన పరిస్థితులలో సామాజిక బాధ్యతతో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో వేలాదిమంది సేవలు చేసారని, పేదలకు, వద్దులకు,వితంతువులకు, విద్యార్థులకు అండగా నిలిచిన సంకాబత్తుల వెంకట్ కి రోటరీ అవార్డు అందించడం జరిగిందని గవర్నర్ సుబ్బారావు రావూరి అన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణా జిల్లా రోటరీ ప్రెసిడెంట్ యస్.వి.ఆర్.ప్రసాద్, సెక్రటరీ జి.వి.యస్ సందీప్ డైరెక్టర్ కరంబీర్ కౌర్ మరియు రోటరీ లీడర్స్ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



సీజ్ చేసినవి నాలుగు..తీసుకొచ్చినవి రెండు

- తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది లీలలు

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులకు అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. సాక్షాత్తు జిల్లా కేంద్రంలోని ఆయా శాఖల అధికారులు డిమాండ్ చేసి మరి వసూలు చేయడం పట్టణంలో రివాజుగా మారింది. దీనికి అనుమతులు లేకుండా తోలుతున్న మట్టి తవ్వకాలే ఇందుకు నిదర్శనంగా తెలుస్తోంది. సోమవారం మచిలీపట్నం మండల పరిధిలోని బుద్ధాలపాలెం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వుతున్నట్లు స్థానిక తహసిల్దార్ కార్యాలయానికి సమాచారం అందింది దీంతో హటాహుటిన వాటిని నిలిఎ వేసేఎందుకు రెవెన్యూ, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఘటన స్థలంలో రెండు ట్రాక్టర్లు, ఒక జెసిబి, ఒక ప్రొక్లైన్ ఉండటంతో పోలీసు, రెవెన్యూ అధికారులు వాటిని నిలిపివేశారు. అంతేకాకుండా సీజ్ చేస్తున్నామంటూ వాటిల్లోని కేవలం ఒక ట్రాక్టర్, ఒక జెసిబి మాత్రమే తాసిల్దార్ కార్యాలయానికి తరలించారు. మిగిలిన మరో ట్రాక్టర్ ప్రోక్లిన్ లు ఈ కేసు నుంచి తప్పించేందుకు 50 వేల రూపాయలు సంబంధిత అధికారులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆ వాహనాల యజమానులతో 40 వేలకు బేరం కుదుర్చుకున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో మరో ట్రాక్టర్, జెసిబి మాత్రమే తహసిల్దార్ కార్యాలయం తరలించి ఈ రెండు వాహనాలను సీజ్ చేసినట్లు సాక్షాత్తు తహసిల్దారు కార్యాలయం నుంచి పత్రిక ప్రకటన విడుదల చేశారు.



స్వాధీనం చేసుకున్న జెసిబి

కొంపముంచింది వాటాలే

ప్రోక్లైన్ మరో ట్రాక్టర్ ఈ కేసులో నుంచి తప్పించేందుకు సదరు యజమానుల వద్ద నుంచి 40 వేల రూపాయలు లంచంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే వీటిల్లో రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారుల సమన్వయ లోపంతోని వాటాలలో సమానంగా పంచకపోవడంతో ఈ విషయాన్ని సిబ్బంది బహిరంగం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీజ్ చేయాల్సిన ఆ రెండు వాహనాలను తరలించి వాటి యజమానులపై చర్యలు తీసుకుంటారో లేక రెవిన్యూ, పోలీస్ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో అనేది ప్రశ్నార్థకం గా మారింది.



కొనకళ్ళను పరామర్శిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్

కొనకళ్లను విక్కుర్తి పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల గుండెనొప్పికి గురై విజయ వాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీ, టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావును అవనిగడ్డకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కు ర్తి శ్రీనివాస్ పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో తమకు గల పరిచయాలను కొనకళ్ళ విక్కుర్తి గుర్తుచేసుకొని కొద్దిసేపు ముచ్చటించుకున్నట్లు తెలిపారు. అలాగే కొనకళ్ళ సోదరుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ జగన్నాధరావు(బుల్లయ్య) విక్కుర్తి శ్రీనివాస్ కొద్దిసేపు చర్చించుకున్నారు. అనారోగ్యం నుంచి కోలుకొని త్వరలోనే కొనకళ్ళ ప్రజాక్షేత్రంలోకి రావాలని శ్రీనివాస్ తెలిపారు ఈ కార్యక్రమంలో విక్కుర్తి రాంబాబు, బర్మా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ

ఎన్నికల నియమావళి పాటించకపోతే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : పమిడిముక్కల సర్కిల్ పరిధిలోని ప్రజలంతా ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. కిషోర్ బాబు తెలిపారు. సోమవారం సర్కిల్ పరిధిలోని తోట్లవల్లూరు మండలం పెనమకూరు, గరికపర్రు, గురువిందపల్లి, రొయ్యూరు గ్రామాలలో పర్యటించి ప్రజలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. పై గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు ఈ గ్రామాల్లోని ప్రజలు ఎటువంటి ఆవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. శాంతి భద్రతలలో భాగంగా సమస్యాత్మక గ్రామాలలో పోలీసు పికెట్స్ ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు సమీపిస్తున్న తరుణంలోఎన్నికలు నియమావళిని ప్రజలందరూ తూచా తప్పకుండా పాటించాలన్నారు. బహిరంగంగా గాని సోషల్ మీడియా ద్వారా గాని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయరాదన్నారు. బాణసంచా పేల్చడానికి ఎలాంటి అనుమతులు లేవని సెక్షన్ 30పోలీస్ యాక్ట్ మరియు సెక్షన్ 144 అమలులో ఉన్నాయన్నారు. ఎలక్షన్ ఫలితాలు దష్ట్యా ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని, కేసులలో ఇరుక్కోవద్దని యువతకు సూచించారు. చట్టం దష్టిలో అందరూ సమానులే చట్టాన్ని అతిక్రమించినట్లయితే ఎంతటి వారిపై నైనా చట్టపరమైన చర్యలు వుంటాయని ప్రతిఒక్కరు సమాజం పట్ల భాద్యతతో ఉండాలని సిఐ కిషోర్ బాబు తెలిపారు.

ముగిసిన జాతర మహోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కూరాడ గ్రామంలో వేచేసియున్న శ్రీ గంగానమ్మ జాతర మహెూత్సవాలు ఘనంగా ముగిశాయి. గతవారం రోజులుగా అత్యంత వైభవంగా నిర్వహించిన మహెూత్సవాలు సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం, అమ్మవారికి కొర్ల మేడ బండిలో మేళ తాళాలతో, కనక డబ్బులతో గొప్ప ఊరేగింపు కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించారు. కూరాడ గ్రామ దేవత గంగానమ్మ కమిటీ ఏర్పాట్లు నిర్వహించగా ఇతర గ్రామాల నుండి బంధువులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నెట్టెం రఘురాంకు శుభాకాంక్షలు తెలిపిన శ్రీరామ్, తదితరులు

నెట్టెంకు శ్రీరామ్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురామ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు రఘురామ్ నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి, బొకే అందజేసి, మొక్కలు నాటి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి (ఎఒ) పి.పద్మ తెలిపారు. సోమవారం నడిమి తిరువూరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పచ్చి రొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు పొలం పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ తీసుకుని వారి వారి రైతు భరోసా కేంద్రంలో తీసుకోవచ్చన్నారు. ప్రధాన పంట వేసేందుకు ముందుగా పొలంలో పచ్చిరొట్ట సాగుచేసి 50 శాతం పూత దశలో దున్నితే నేల గుల్ల బారడంతో పాటు 10 నుండి 20 శాతం రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించొచ్చన్నారు. తిరువూరు మండలానికి 550 క్వింటాల జీలుగలు, 142 క్వింటాల పిల్లిపెసర అవసరమని ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టామని అన్నారు. ప్రస్తుతం జీలుగులు పంపిణీ జరుగుతోందని, పిల్లిపెసర వచ్చే వారంలో వస్తాయని తెలిపారు. సబ్సిడీ పోను జీలుగలు కిలో రూ.44, (క్వింటా రూ.4400), పిల్లి పెసర కిలో రూ.67 (క్వింటా రూ. 6700) చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ కోరారు.

ఆర్ఒ వెంకటేశ్వర్లుకు ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లుకు సోమవారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఎన్నికల విధులను సమర్ధ వంతం గా నిర్వహిం చడం, పాత్రికేయులకు సకాలంలో సమా చారం అందిం చడం, నామినేషన్ల ప్రక్రియ నుంచి ఓటింగ్ వరకు విధులలో ఆర్‌వో జి.వెంకటేశ్వర్లు చేసిన కృషిని ఈ సందర్భంగా పాత్రికేయులు ప్రశంసించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు టి.ఎల్.ఎన్ ఆచార్యులు (మూర్తి) ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ సత్కారంలో మాజీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు ఎం.సైదేశ్వరరావు, పాత్రికేయులు ఎలదండి శ్రీనివాసరావు, సోమోజు శ్రీనివాసరావు, విజయ పాల్, అల్లి రవిచంద్, చింత శ్రీనివాసరావు, కాకనబోయిన శివ, ఆనంద్, నజీర్, తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.

నేరెడ్కో నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :

నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ (నేరెడ్కో) ఆంధ్రప్రదేశ్ శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం విజయవాడలోని ఒక హెటల్లో జరిగిన సమావేశంలో ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి జి.తిరుపతి రావు ఒక ప్రకటనలో వెల్లడించారు. నిర్మాణ రంగంలో ఉన్న సభ్యుల సమూహంగా ఏర్పడిన నేరెడ్కో అనేక సేవకార్యక్రమాలు, వ్యాపార కార్యక్రమలు చేపడ్తు తనదైన శైలీలో నెంబర్ వన్‌గా నిలుస్తూ ఆంధ్రప్రదేశ్ లో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. విజయవాడ ప్రాంగణంలో జరిగిన సర్వసభ్యసమావేశంలో నేరెడ్కో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగ చైర్మన్ గా జి హరిబాబు, అధ్యక్షులుగా గద్దే చక్రధర్, ఒకటవ కార్యనిర్వాహక వైస్ ప్రెసిడెంట్ గా పరుచూరి కిరణ్ కుమార్, రెండో కార్యనిర్వాహక వైస్ ప్రెసిడెంట్‌గా వై.దుర్గా ప్రసాద్, మూడో కార్యనిర్వాహక వైస్ ప్రెసిడెంట్ తాళ్లూరి శివాజీ , ప్రధాన కార్యదర్శిగా ఎం సీతరామయ్య , కోశాధికారిగా చావా రమేష్ బాబు లతో పాటు ఐదుగురు వైస్ ప్రెసిడెంట్లు, ఆరుగురు కార్యదర్శులు, 21 మంది గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు ఎన్నికయ్యారన్నారు. వీరు 2024-2026 సంవత్సరకాలంలో పనిచేస్తూ నిర్మాణ రంగానికి సేవలందిస్తారని తెలిపారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ



జగ్గయ్యపేట గ్రంథాలయంలో...

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ సంచాలకుల ఆదేశాల నాలుగో రోజు సోమవారం పట్టణంలోని గ్రేడ్ 1 గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు విద్యార్థులచే పుస్తక పఠనం, కథలు చదివించి వారితో చెప్పించారు. తదుపరి కవి, ఉపాధ్యాయులు దోసపాటి.నాగేశ్వరరావు తెలుగు వ్యాకరణంలో వర్ణమాల వాటిని ఎక్కడ ఉపయోగించాలో వివరించారు. తదుపరి ఉపాద్యాయులు వినోద్‌బాబు ఇంగ్లీష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించారు. చంద్రశేకర్ చిత్ర లేఖనంలో మెలకువలు తెలియజేసి బొమ్మలు తేలికగా వేయటం నేర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ, సిబ్బంది జె.శ్యామల, సత్యవతి, రమేష పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచన కోసమే శిక్షణ

తిరువూరు : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి భవిష్యత్‌లో వారు వివిధ రంగాల్లో రాణించేందుకు వీలుగా శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని ఎంఇఒ శ్యాం సుందర్ తెలిపారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గత 24 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగించింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పోటీల్లో విజేతలైన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్, ఉపాధ్యక్షుడు ఎం.హరికష్ణ, నాయకులు ఎం.రాంప్రదీప్, కె.పాపారావు, డి.సుదర్శన్, ఎం.సుధాకర్, పి.శీనయ్య, పి.శోభన్ బాబు, ఎస్.డి.సుభానీ, జి.సురేంద్ర నాథ్ మరియు యూటీఎఫ్ మండల అధ్యక్షులు ఆర్.వినయ్ కుమార్ పాల్గొన్నారు.

కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో...

కంచికచర్ల : కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు 67వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టంగుటూరి ప్రకాశం పంతులు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పనిచేశారని, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణయాత్మక పాత్ర పోషించారన్నారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకికెదురుగా గుండెనుంచి ఆంధ్ర కేసరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ లైబ్రేరియన్ రంగిశెట్టి వెంకటేశ్వర్లు, క్రాఫ్ట్ మాస్టర్ ఎమ్.కనకారావు, డ్రాయింగ్ కవి మాస్టర్ సర్వేశ్వరరావు, యోగా మాస్టర్ ఎమ్.మాణిక్యాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు నీతి కథలు బోధించారు. ఎమ్.కనకారావు విద్యార్థులకు క్రాఫ్ట్‌వర్క్ నేర్పించారు. కవి, డ్రాయింగ్ మాస్టర్ సర్వేశ్వరరావు, డ్రాయింగ్ నేర్పినారు. యోగా మాస్టర్ ఎమ్.మాణిక్యాలరావు, విద్యార్థులకు వజ్రాసనము, ధ్యానం, అమృతాసనం వంటి యోగాసనాలు విద్యార్థులకు నేర్పించారు. అనంతరం విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. చెస్ ఆడారు. విద్యార్థులకు ఆటలు, పాటల్లో శిక్షణ ఇచ్చారు.



కంచికచర్ల గ్రంథాలయంలో...



తిరువూరు గ్రంథాలయంలో...

వందశాతం ఫలితాలు అభినందనీయం



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎంఇఒ -1, తదితరులు

ప్రజాశక్తి - తిరువూరు : పదో తరగతి ఫలితాల్లో తిరువూరు మండలం, గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంద శాతం ఫలితాలు సాధించడం అభినంద నీయమని విద్యా శాఖ మండల ఒకటో అధికారి శ్యాం సుందరరావు అన్నారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో గానుగపాడు పాఠశాల ప్రచార కరపత్రాలను సోమవారం అయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు సమిష్టి కృషితో మంచి ఫలితాలు సాధించారని అభినందించారు. ఇదేస్ఫూర్తిని ముమ్మందు కూడా కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.ఆదిలక్ష్మీ, ఉపాధ్యాయులు వి.సాయిరాం, ఎస్.వి.బి.రాజేంద్ర ప్రసాద్, ఎం.రాంప్రదీప్, ఎస్.రామారావు, డి.సుదర్శన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అంకురార్పణ, ధ్వజారోహణ అగ్నిప్రతిష్టాపనాది కార్యక్రమములు నిర్వహించారు. గుంటూరు జిల్లా ఉల్లిందన వాస్తవ్యులు ఈ యొక్క బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానానికి వచ్చు యాత్రికులందరికీ రెండో రోజు కూడా అన్నదానం ఏర్పాటు చేసినట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి శిరపరపు హేమలత దేవి తెలిపారు. కళ్యాణ కార్యక్రమాల్లో దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త తరుపున కె సి పి ఎ జి ఏం పి. రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : కోరంలేక రెడ్డిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ముందుగా అనుకున్న ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు రామినేని దేవి ప్రవీణ్య వీరస్వామి నాయడు అధ్యక్షతన సమావేశమైన అధికారులు సభలో కోరంలేక అరగంట వాయిదా వేసినట్లు ఎంపిడిఓ ఆశీర్వాదం ప్రకటించారు. అనంతరం ప్రారంభమైన సభను కోరం లేక నిరవధికంగా వాయిదా వేసినట్లు ప్రవీణ్య వీరస్వామి ప్రకటించారు.

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘన

టార్గెట్లతో ఉపాధ్యాయులను రోడ్లపై తిప్పుతున్న కార్పొరేట్ విద్యా సంస్థలు

ఎర్రటి ఎండలో వడదెబ్బతో ఇక్కట్లు

అధిక ఫీజులతో తల్లిదండ్రుల్లో ఆందోళన



ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా వ్యాపారం చేయడానికి శ్రీకారం చుట్టి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రైవేటు విద్యా సంస్థలు ప్రవేశాలు నిర్వహించాల్సి ఉంది. నందిగామలో కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి తుంగలో తొక్కాయి. నందిగామ జాతీయ రహదారి పక్కన ఒక కార్పొరేట్ విద్యా సంస్థ ఉపాధ్యాయులకు ఎడ్మిషన్ టార్గెట్‌లు పెట్టి ఎర్రటి ఎండలకు క్యాంపెయిన్లకు తిప్పటంతో, అదే పాఠశాల ఉపాధ్యాయిని వడదెబ్బ తగిలి మృత్యువాత పడినా సదరు కార్పొరేట్ విద్యా సంస్థ యథేచ్ఛగా పిల్లలు ఎడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులను క్యాంపెయిన్ తిప్పుతుండగా ఉపాధ్యాయిల నుండి వ్యతిరేకత వస్తుంది. నందిగామలో పలు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు ఇదే బాటలో నడుస్తున్నాయి. చైతన్య, నారాయణ, రవీంద్ర భారతి తదితర కార్పొరేట్, ప్రైవేటు స్కూల్ విద్యా సంస్థలు పెట్టే టార్గెట్‌లకు ప్రైవేటు స్కూల్ ఉపాధ్యాయులు హడలిపోతున్నారు.

అధిక ఫీజులతో తల్లి దండ్రులు ఆందోళన...

విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజులు భారీగా పెంచాయి. యుకెజి నుండి పదో తరగతి వరకు రూ.పది వేల నుండి రూ.లక్ష పైగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. భారీగా పెరిగిన పుస్తకాల ధరలు, విద్యార్థులకు అవసరమైన టెక్స్టబుక్స్, నోట్‌బుక్స్, స్టేషనరీ ధరలు అమాంతం పెంచారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు సిండికేట్‌గా మారి ధరలు విపరీతంగా పెంచారు. విద్యార్థులు పుస్తకాలు బయట కొననివ్వకుండా ఆయా పాఠశాలలోనే పుస్తకాలు, మెటీరియల్స్ కొనాలని నిబంధనలు పెట్టడంతో అధికధరలు పెట్టి కొనుగోలు చేయవలసి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఒకొక్క విద్యార్థికి రూ.పది వేలకు పైగా వెచ్చించి పుస్తకాలు కొనుగోలు చేయాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా శాఖ అధికారులు మొద్దు నిద్ర వీడి కార్పొరేట్ విద్యా సంస్థలపై కొరడా ఝుళిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : జిల్లాలో ఈనెల 24వ తేదీ నుండి జరిగే ఎస్ఎస్‌సి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయం నుండి గూగుల్ మీట్ ద్వారా పదవ తరగతి(ఎస్.ఎస్.సి.) అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో ఈ నెల 24వ తేదీ నుండి వచ్చే జూన్ నెల 3 వ తేదీ వరకు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 గంటల వరకు ఎస్ఎస్సి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ పరీక్షలలో 395 పాఠశాలలకు చెందిన 6,046 విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. వీరి కోసం 24 పరీక్షలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, పరీక్షల నిర్వహణకు 24 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 24 మంది శాఖా పరమైన అధికారులను, 302 మంది ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందన్నారు. అలాగే 2 ఫ్లయింగ్ ప్యాడులను, 11 స్టోరేజ్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రశ్నాపత్రాలు, రహస్య సామాగ్రిని భద్రపరిచిన స్టోరేజ్ పాయింట్ల వద్ద, వాటిని పరీక్షా కేంద్రాలకు తరలించేటపుడు, పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో ఫ్లయింగ్ స్క్వాడులు ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షించాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద ప్రజలు ఎవరు గుమికూడకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ ను గట్టిగా అమలు చేయా లన్నారు. పరీక్షల నిర్వహ ణను ఎప్పటికప్పుడు సజావుగా పర్యవేక్షించేందుకు ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలు జరిగే సమ యంలో పరీక్షా కేంద్రాల సమీపంలో ఎక్కడ జిరాక్స్ కేంద్రాలు మూసివేసేలా గట్టిగా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల జవాబు పత్రాలను వచ్చిన రోజే సకాలంలో ఉన్నతాధికారులకు బట్వాడా చేయడానికి తపాలా శాఖ సిద్ధంగా ఉండాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్షా కేంద్రాలకు చుట్టుపక్కల విద్యుత్ సరఫరాకు



ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కావాల్సినన్ని మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందు బాటులో ఉంచుకోవా లన్నారు. మున్సిపల్ కమిష నర్లు పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు పారిశుద్ధ్యం ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రశ్నాపత్రాల పంపిణీలోను, జవాబు పత్రాలు తపాలా కార్యాలయానికి చేరవేయడంలో కావలసినన్ని వాహనాలను రవాణా శాఖ సమకూర్చా లన్నారు. అలాగే రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో వచ్చే జూన్ 1 వ తేదీ నుండి 8 వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు కూడా సజావుగా చేయాలన్నారు ఈ గూగుల్ మీట్ లో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, డీఈవో తాహెరా సుల్తానా, ఎస్బి ఇన్స్పెక్టర్ వెంకటరమణ, ఆర్టీసీ డిఎం పెద్దిరాజు, డిటిసి పురేందర్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ డేవిడ్ రాజు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



పుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న భవానీపురం సిఐ దుర్గాప్రసాద్, సిబ్బంది

గొల్లపూడిలో పోలీసుల పుట్ పెట్రోలింగ్

ప్రజాశక్తి - భవానీపురం : మరి కొద్ది రోజులలో ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో భవానీపురం స్టేషన్ పరిధిలో అసాంఘిక శక్తులు గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని భవానీపురం పోలీస్‌స్టేషన్ సిఐ డి. దుర్గా ప్రసాద్ తెలిపారు. భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సి.పి. పి.హెచ్. డి రామకష్ణ ఆదేశాలతో వెస్ట్ డి.సి.పి హరికష్ణ, వెస్ట్ ఏసీపీ మురళి కష్ణ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో భవానీపురం పోలీసులు పుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతగా జరిగాయన్నారు. అయితే గొల్లపూడి గ్రామంలోని కొన్ని ప్రాంతాలు సమస్యాత్మక ఏరియాలుగా పరిగణించడం జరిగిందన్నారు. సెన్సిటివ్ ఏరియాస్‌లో ప్రజలకు భరోసా కల్పించడం కోసం పోలీసులతో పుట్ పెట్రోలింగ్ నిర్వహించామన్నారు. ఎన్నికల ముగిసిన అనంతరం జూన్ 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ జరుగుతుందని, అప్పటి వరకు ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అభ్యర్థుల మీద పందాలు కట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రజలు కౌంటింగ్ తర్వాత కౌంటింగ్ ముందు పోలీస్ వారికి సహకరించాలన్నారు. విజయవాడ కమిషనరేట్ పరిధిలో 144వ సెక్షన్ అమలులో ఉందన్నారు. కావున రోడ్లపై నలుగురికి మించి ఎక్కువగా గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసు వారికి సమాచారం అందించాలని సిఐ దుర్గాప్రసాద్ స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : దాసరి గ్లోరీ మినిస్టరీ ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం బేతవోలు పెద్దపేటలోని మద్దాల ఇశ్రాయేలు మెమోరియలో దాసరి గ్లోరీ మినిస్టరీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో దాసరి గ్లోరీ ఆనంద్‌ల తల్లిదండ్రులు దాసరి క్రీస్తుదాసు, అవ్వమ్మల జ్ఞాపకార్థం వృద్ధులకు దుస్తులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు చోరగుడి ఇస్రాయేల్, పాస్టర్లు బండి వెంకటరమణ, గూడపాటి విలియం, ఎం.అనిల్‌కుమార్, హానోక్‌లు మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి ఏడాది గ్లోరీ ఆనంద్ వృద్ధులకు దుస్తులు పంపిణి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తియోప్లస్ రాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణి చేస్తున్న దృశ్యం

జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు



గుడివాడలో...



ఘంటసాలలో..

ప్రజాశక్తి - గుడివాడ : సోమవారం జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టౌన్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో విజయవాడ రోడ్డు లోని దినెక్స్ థియేటర్ వద్ద జరిగిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ పుట్టినరోజు కేక్ కట్ చేసిన అభిమానులు ఒకరికి ఒకరు తినిపించుకుంటూ, జిందాబాద్ ఎన్టీఆర్ అని నినాదాలు చేశారు. అనంతరం బైపాస్ రోడ్డులోని మమత వద్దుల ఆశ్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో ముదిరాజ్ యువత ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత సెంటర్లో కేక్ కట్ చేసి మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం శ్రీకాకుళం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా టీడీపీ నేతలు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్న), గ్రామ పార్టీ అధ్యక్షులు దాసం రామకష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆతుకూరి సీతారామరాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. సోమవారం విద్యార్థులుచే పంచతంత్ర నీతి కథలు చదివించటం, ఐక్యమత్యమే మహాభాగ్యం అనే నీతి కథ చదివించి వాటిని వివరించారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గూర్చి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిని టి వాణి తెలిపారు. **ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థినీ విద్యార్థులు పుస్తక పఠనము, శ్లోకాలు, పాటలు, క్రాఫ్ట్ , నిర్వచనం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి బాబురావు మాట్లాడుతూ.. పిల్లల్లో విజ్ఞానం పెంపొందించడానికి కషి చేస్తున్నట్లు చెప్పారు. **ప్రజాశక్తి ఉయ్యూరు :** స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణశిభిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. అంతకు ముందు విద్యార్థులచే కథల పుస్తకాలు చదివించి కథలు చెప్పించారు. జనరల్ నాలెడ్జి, నైతిక విలువలపై ఎన్ సాంబశివరావు విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ అధికారి రమణి, సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థిని విద్యార్థులకు పలు అంశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కథలు చదవడం, కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం, తెలుగు పద్యాలు, పాటలు యోగా నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి నవ్య సాయి, జి జ్యోతి, అనిల్ కుమార్, పి జాన్సన్ పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి జే ప్రభుదాస్ పర్యవేక్షించారు.



ఉయ్యూరులో..



గుడ్లవల్లేరులో...



గన్నవరంలో...



అవనిగడ్డలో...

పుస్తక పఠనం

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్యార్థులు వేసవికాలంలో గ్రంథాలయాలను వినియోగించుకోవాలని, పుస్తక పఠనం ఎంతో ముఖ్యమని పమిడిముక్కల గ్రంథాలయ కార్యదర్శి షరీఫ్ అన్నారు. సోమవారం మండలంలోని మేడూరు, పెనుముచ్చు, కపిలేశ్వరపురం, గురజాడ, పమిడిముక్కలలో గ్రంథాలయాల ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనం చేయించారు. అంబేద్కర్, గాంధీ, నెహ్రూ వంటి వారి జీవిత చరిత్ర చదవడం ద్వారా విద్యార్థులలో భారతదేశ రాజ్యాంగ విలువల పట్ల సానుకూలత పెరుగుతుందని తెలిపారు. అలాగే అగ్నిపర్ గ్రంథాలయ శాఖలో నీతి కథలు చదివించారు. ఈకార్యక్రమంలో బొబ్బ లావణ్య, సుబ్బారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లనపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం గొల్లనపల్లి గ్రామం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థల వారి సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్లు సదాలక్ష్మి, కరుణ, పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ వ్యాధితో మరణించిన వారికి సంఘీభావం తెలిపారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఐటిఐ కోర్సుతో త్వరగా ఉద్యోగాలు

దేవరపల్లి విక్టర్ బాబు



మాట్లాడుతున్న విక్టర్ బాబు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మన దేశంలో ప్రభుత్వ ఉద్యోగానికి చాలా ప్రాధాన్యత ఇస్తారు. చాలా మంది యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటారు. కొంతమంది కుటుంబ కారణాల వల్ల త్వరగా ఉద్యోగం పొందాలని కోరుకుంటారు. ఈ పరిస్థితిలో ఎక్కువ మంది విద్యార్థులకు ఐటీఐ కోర్సు వరంలాంటిది అని ఒకేషనల్ గైడెన్స్ జిల్లా కమిటీ చైర్మన్ దేవరపల్లి విక్టర్ బాబు తెలిపారు. సోమవారం ఉదయం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ ఆవరణలో ఉన్న ఐటిఐ ప్రాంగణంలో ఒకేషనల్ గైడెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి, ఒకేషనల్ గైడెన్స్ కమిటీ చైర్మన్ విక్టర్ బాబు మాట్లాడుతూ ఐటిఐ చదివిన వెంటనే అభ్యర్థి నైపుణ్యతను బట్టి ప్రభుత్వ ఉద్యోగం పొందొచ్చు. ఐటిఐ తర్వాత రైల్వే, ఆర్మీ సహా అనేక ప్రభుత్వ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. అంతేకాకుండా ప్రైవేట్ రంగంలో కూడా సులభంగా మంచి ఉద్యోగం పొందవచ్చని అన్నారు. ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ కనకరావు మాట్లాడుతూ ఐటిఐ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని జూన్ 10 వరకు అడ్మిషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ త్వరితగతిన అడ్మిన్షన్ల ప్రక్రియ పూర్తి చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.విజయలక్ష్మి,జిల్లా పరిశ్రమల అధికారి సాంబయ్య, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎస్.ఎన్.రెడ్డి, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి పి.నరేష్, ఒకేషనల్ గైడెన్స్ అధికారి వై.సత్య బ్రహ్మం, ప్రాంతీయ ఉపాధి కల్పన అధికారి రామ్మోహన్ రెడ్డి, జన శిక్షణ సంస్థ నుండి పూర్ణిమా, ప్రయివేటు రంగ సంస్థల నుండి వరుణ్ మోటార్స్ తరుపున కిషోర్, ప్రయివేట్ ఐటిఐ మేనేజ్మెంట్ సెక్టర్ నుండి సుచిత్ర ఇతర తదితర ప్రయివేటు యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - విస్సన్నపేట : ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా సోమవారం సాయం త్రం విస్సన్న పేటలో ఎస్.ఐ రామ కృష్ణ ఆధ్వర్యంలో రోడ్ల పక్కన నిలిపే వాహనాలను రోడ్డు మీదికి చొచ్చుకు వచ్చిన వ్యాపారస్తుల సంబం ధించిన బోర్డులను తొలగించారు. రోడ్డు ప్రమాదాల నివారణ దృష్ట్యా రోడ్డుపై ట్రాఫిక్ నిలవటంతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా, ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవటం పట్ల అవగాహన కల్పించారు. మైలవరం ఎసిపి మురళీ మోహన్, తిరువూరు సిఐ అబ్దుల్ నబీ పర్యవేక్షించారు.



పోలీసుల కవాతు

ప్రజాశక్తి- నందిగామ : సాధారణ ఎన్నికల జరిగిన నేపథ్యంలో ప్రజలు శాంతి భద్రతలు పరిరక్షణ కొరకు సోమవారం నంది గామ పోలీ సులు ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల జరిగిన నేపథ్యంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత గ్రామాలలో ప్రజల ఇబ్బంది పండగకుండా మంచి వాతా వరణంలో ఉండాలని నందిగామ ఎసిపి రవి కిరణ్ తెలిపారు. ఎటువంటి రాజకీయ పార్టీలు ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా పోలీస్ వారు ఉన్నారని తెలిపారు. అడివిరావులపాడు గ్రామంలో నందిగామ ఎసిపి రవికిరణ్ అధ్యర్యంలో నందిగామ టౌన్ సిఐ హనీష్, ఎస్ఐలు పండుదొర, దుర్గమహేశ్వరరావు, ట్రాఫిక్ ఎసిఐ, సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆలయ ఇఓ రామారావు

దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై అధికారులతో ఇఒ సమీక్ష

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి మహామండపం నాల్గవ అంతస్తులోని కార్యనిర్వాహనాధికారి వారి కార్యాలయం నందు అన్ని విభాగముల అధికారులతో ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్. రామారావు సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించి, పలు అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా దుర్గగుడి అభివృద్ధిధ పనుల నేపథ్యంలో మాస్టర్ ప్లాన్‌లో భాగంగా అన్ని విభాగముల వారు తీసుకొనవలసిన చర్యలు, భక్తులకు త్వరగా దర్శనం కల్పించుటకు చర్యలు, ఆధ్యాత్మికను ఇంద్రకీలాద్రిని సౌందర్యవంతంగా తీర్చిదిద్దే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పెరుగుచున్న యాత్రి కులు, భక్తుల రద్దీ దష్ట్యా తక్షణం పార్కింగ్ సౌకర్యాలు, తది తరాలపై చర్చించారు. ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ లిం గం రమాదేవి ఇంజినీరింగ్ సిబ్బంది, ఆలయ సహాయ కార్య నిర్వాహణాధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.జ్యోతిర్మయి సోమవారం కుటుంబసభ్యులతో కలిసి శ్రీ అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ లింగం రమ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు.

సోనీ నుండి ఎక్స్ఎస్ కారు స్పీకర్లు విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆటోమోటివ్ సౌండ్ విప్లవంలో సరికొత్త టెక్నాలజీతో సోనీ సంస్థ ఎక్స్ఎస్ 162 జీఎస్ కారు స్పీకర్లను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సోనీ షోరూమ్ మేనేజర్ కె.రవికాంత్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని షోరూమ్‌లో కారు స్పీకర్ల గురించి అవగాహన కల్పించారు. కారు ఆడియో నుండి అత్యున్నత శ్రవణ అనుభవాలను పొందాలనుకునే వారికి సరికొత్త టెక్నాలజీతో రూపొందిం చారన్నారు. 16 సెంటీమీటర్లు, 2వే కాంపో నెంట్ స్పీకర్‌లను ఎక్స్ ఎస్ 162 జీఎస్ సిరీస్‌లో అందిస్తున్నట్లు తెలిపారు. ఖచ్చితత్వంతో రూపొందించిన ఈస్పీకర్లు రిచ్‌బాస్ కోసం కాంపోజిట్ పాలీ ప్రొఫైలిన్ కోన్ ఫూవర్‌తో తయారు చేశారన్నారు. పలువురు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారుల అవినీతి అక్రమాలకు

వికలాంగుల కుటుంబాలు రోడ్డుపాలు

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2019లో ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆలోచనతో గ్రామ వార్డు సచివాలయాలు వ్యవస్థను తీసుకువచ్చిందని కానీ వికలాంగుల శాఖ అధికారులు వారి వ్యక్తిగత స్వలాభం కోసం వికలాంగుల జీవితాలను రోడ్లపాలు చేశారని ఆవేదన వ్యకం చేశారని ఇండియా వికలాంగుల ఎంప్లాయిస్ అసోసియేషన్ విజయవాడ ఆర్గనైజర్ సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. పైపుల రోడ్డు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగుల హక్కుల చట్టం 2016 ఉన్నప్పటికీ వికలాంగుల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఒక్కొక్క సచివాలయంలో 18 రకాల పోస్టులున్నాయి. ఎన్టీఆర్ జిల్లాల్లో ఉన్న 286 సచివాలయంలో ఉండగా వికలాంగులకు 206 పోస్టులు రావాల్సి ఉండగా ఎక్కడ కూడా వికలాంగుల పోస్టులు కనిపించడం లేదని మండిపడ్డారు. ఈ విషయమై వికలాంగుల శాఖ కమిషనర్‌కి 2020లో ఐడి ఈఏ ద్వారా ఫిర్యాదు చేయగా కమిషనర్ ఈ ఫిర్యాదును జాప్యంతో ప్రభుత్వం మారే సమయంలో ఇప్పుడు ఆర్డర్లు జారీ చేశారని విమర్శించారు. ఇది అమలవుతుందో లేదో తెలియదని కేవలం కమిషనర్ నిర్లక్ష్యమని అవినీతితో అక్రమాలు కారణంగా సుమారు ఆంధ్రప్రదేశ్ మొత్తం రూ.12వేల మంది వికలాంగుల కుటుంబాలు రోడ్డుపాలు చేయడంతో పాటు వికలాంగుల కుటుంబాలు రోడ్డుపైన పడ్డాయన్నారు. దీనిపై ఉన్న అధికారులు పరిశీలించి ప్రభుత్వ ఉద్యోగాలు వికలాంగులకు అందించాలన్నారు. ఇండియా వికలాంగుల ఎంప్లాయిమెంట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వినయ్‌కుమార్ సేవలు అభినందనీయం



వినయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ మిడ్‌టౌన్ సభ్యులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : న్యూ జనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్ ఫౌండర్, సెక్రెటరీ సాయి వినయ్ కుమార్ చేస్తున్న సేవలు అభినందనీయమని రోటరీ క్లబ్ గవర్నర్ దత్త సుబ్బారావు కొనియాడారు. ఈ సందర్భంగా వినయ్‌కు మార్‌కు ఘనసత్కారం జరిగింది. బందరు రోడ్డులోని హోటల్ వివంతలో రోటరీ క్లబ్ మిడ్ టౌన్ నిర్వహించిన కార్యక్రమంలో పలు ఎన్జీవో సంస్థలును సత్కరించగా అందులోని భాగంగా న్యూ జనరేషన్ యూనిటీ ఆర్గనైజేషన్ సంస్థ సేవలను ప్రశంసిస్తూ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి సాయి వినయ్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఉచిత విద్య ద్వారా ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులకు వారి ప్రతిభలు చాటేలా తోడ్పాటు అందించడం, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల విద్యార్థిని విద్యార్థులకు గణచారినులకు (హిజ్రా) పౌష్టికాహారం అందించడం, మెడికల్ క్యాంపుల ఏర్పాటు ద్వారా పలు వ్యాధులపై, మానసిక ఒత్తిడిపై, మత్తు పదార్థాల చెడు అలవాట్లుపై అవగాహన కల్పించడం సాయి వినయ్ చేశారు. అలాగే బాల్య వివాహాలు, బాల కార్మికుల వ్యతిరేకత, రక్తదానం, అవయవ దానం, పెద్దలపట్ల క్రమశిక్షణ, పశు పక్షుల మీద ప్రేమ వంటి ఎన్నో పిల్లలకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. లాక్ డౌన్ వంటి కష్టకాలంలో ఇతర ప్రత్యేక రోజులలో పేద ప్రజలకు భోజనాలు, మందులు అందించారు. విద్యార్థులకు చదువుకు సంబంధించిన పరికరాలు, దుప్పట్ల పంపిణీ, మహిళలకు చీరలు అందిస్తూ వంటి మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ దత్త సుబ్బారావు, ప్రెసిడెంట్ సాధు ప్రసాద్, ఆర్గనైజర్ కమిటీ మెంబర్స్ ఉసిరిక జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి - విసన్నపేట : విసన్నపేట మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన చిలుకా రంగయ్య (58 సం) ఇంటి వద్ద ఉన్న బావిలో మోటార్‌కి చెత్త అడ్డుగా ఉందని తొలగించేందుకు 50 అడుగుల లోతు ఉన్న బావిలోకి దిగగా ఊపిరి ఆడక ఇబ్బంది పడ్డాడు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వగా వారు సంఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ ఆఫీసర్ (ఇంచార్జి) బి.నానిక ఆధ్వర్యంలో సిబ్బందితో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి బావిలో అపాస్మరక స్థితిలో ఉన్న రంగయ్యను బయటకు తీసి ప్రాణాలు రక్షించారు. ఈ కార్యక్ర మంలో పి.శివ శేఖర్ (లీడింగ్ ఫైర్ మన్), ఆర్‌జెసి గిరిప్రసాద్ (డిఒపి), సిహెచ్.వై. నారాయణ (హెచ్.జి ఫైర్‌మన్) పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజలకు పోలీసుల భరోసా

ప్రజాశక్తి - గంపలగూడెం : జరగనున్న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రజలు ప్రశాంతంగా ఉండేందుకు స్థానిక ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ చర్యలు చేపట్టారు. గ్రామాల్లో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలు వస్తే, తామున్నామని ప్రజలకు భరోసా కల్పించారు.

నగరనాడు రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

వన్‌టౌన్ : నగరనాడు రాష్ట్ర అధ్యక్షులు, శ్రీనన్నదళం రాష్ట్ర అధ్యక్షులు పోతిన వరప్రకాష్ జన్మదిన వేడుకలు సోమవారం జరిగాయి. పాతశివాల యంలో వరప్రకాష్‌ను దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బొమ్ము మధు సత్కరించారు. స్వామివారి దర్శనానంతరం తీర్థప్రసాదాలను అందచేశారు. ప్రముఖులు వరప్రకాష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. **(ప్ర.వి)**

ఇసుక రీచ్ పరిశీలన



ఇసుక రీచ్‌ను ప్రాంతం పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలంలో ఉన్న పలు ఇసుకరీచ్‌లను జిల్లా మైనింగ్ డిడి సుబ్రహ్మణ్యం, డీసీపీ శ్రీనివాస్ తోపాటు, జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారుల బందం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారుల బందం మండలంలోని పెండ్యాల వేములపల్లి ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇసుక తవ్వకాలపై సుప్రీంకోర్టు పలు మార్గదర్శకాలు విడుదల చేసిన సంగతి విధితమే. ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం జిల్లాలో పోలీసు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని, కేంద్ర పర్యావరణ శాఖ తరచూ తనిఖీలు చేపట్టాలని ఆదేశించడంతో, జిల్లా ఉన్నతాధికారులు మండలంలో ఇసుక రీచ్‌లను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ డి డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో అధికారికంగా గుర్తింపు పొందిన ఇసుక రీచ్‌లలో ఎటువంటి పనులు జరగడం లేదన్నారు. ఎక్కడా యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరిగినట్లు తమ దృష్టికి రాలేదన్నారు. అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసినట్లు తనకు ఫిర్యాదు రాలేదన్నారు. జిల్లాలో మొత్తం 15 ఇసుక రీచ్‌లు అధికారికంగా పనిచేస్తున్నాయన్నారు. తమ కమిటీలో అన్ని శాఖల అధికారులు ఉన్నారని, రీచ్‌ల పరిశీలన తర్వాత నివేదికల సమర్పిస్తారన్నారు. అనుమతి లేని చోట్ల ఇసుక త్రవ్వకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు ఉంటే పరిశీలిస్తామన్నారు. మైనింగ్ పోలీసు అధికారులతో పాటు ఎస్ఇబి అధికారులు, పొల్యూషన్, డిపిఒ, ఆర్డబ్ల్యూఎస్, రెవెన్యూ, పోలీస్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.